# కొత్త రచయితలు

# నా ప్రేమగీతం

“కొంటెదనంతో మెరిసే చూపు, వెన్నెల వెదజల్లే నవ్వు, బ్రహ్మకైనా గుబులు పుట్టించే అందం ఎవరికున్నది?” అని నన్నెవరైనా అడిగితే ఖచ్చితంగా ‘శిరీష’ పేరే చెపుతాను.

‘ఏ దివిలో విరిసిన పారిజాతమో
ఏ కవిలో మెరిసిన ప్రేమగీతమో’

ఆ అమ్మాయిని చూసినప్పుడల్లా నాకు ఈ పాటే గుర్తుకొస్తుంది. శిరీష మా చెల్లెలు ఉష స్నేహితురాలు. ఎప్పుడూ గంభీరంగా వుండే నన్ను కదిలించడానికి మా ఇంట్లో వాళ్లే కొంచెం భయపడతారు. అలాంటిది శిరీష ... నా కోపాన్నే లెక్క చెయ్యదు. ఒకరోజు హడావుడిగా నడుస్తూ ఎదురుగా వస్తున్న నన్ను ఢీ కొట్టేసి, సారీ చెప్పేసి లోపలికి వేగంగా వెళ్లిపోయింది. ‘అబ్బా, ఎంత హడావుడో ఈ పిల్లకు’ అని నవ్వుకుంటున్న నన్ను చూసి మా ఉష “అరే, షర్ట్ మీద ఏమిటది?” అంది నా వైపు చూపిస్తూ. చప్పున తలవంచి చూసుకున్నాను. ‘ఐయామ్ ఫూల్’ అన్న స్లిప్ అంటించి వుంది నా షర్ట్ పైన. ఆ స్లిప్ నా షర్ట్ మీదికి ఎలా వచ్చిందో అర్థం అయింది నాకు. అంతలోనే ఏమీ ఎరుగనట్లు లోపలి నుండి వచ్చింది శిరీష “ఏమిటి? ఏమైంది?” అంటూ.

“ఏం లేదులే, నువ్వెప్పుడొచ్చావ్?” అంది ఉష శిరీషను గదిలోకి తీసుకెళుతూ. ఉషతో నడుస్తూ నన్ను చూసి చటుక్కున కన్ను కొట్టింది శిరీష. అదిరిపడ్డాను. ‘బాప్‌రే! నిజ్జంగానే కన్ను కొట్టిందా? నేను భ్రమ పడ్డానా?’ అనుకున్నాను ఆ క్షణంలో.

ఒకరోజు ఉష మాటల్లో తెలిసింది. శిరీష నాకు ‘బుద్ధావతారం’ అని పేరు పెట్టినట్లు. నాకు భలే కోపం వచ్చింది. ఏమిటో ఈ అమ్మాయిల మనసే అర్థం కాదు నాకు. అబ్బాయిలు ఫాస్ట్‌గా వుండి కామెంట్స్ చేస్తే ‘రౌడీ’లంటారు. సాఫ్ట్‌గా నాలా బుద్ధిగా వుంటే ఇలా బుద్ధావతారం, ముద్దపప్పు లాంటి పేర్లు పెడతారు. మరిక ఎలా బిహేవ్ చెయ్యాలి వీళ్లతో? “నేను నీ కళ్ళకు ముద్దులా కనిపిస్తున్నానా?” అని కోపంగా శిరీష నడిగేద్దామనుకున్నా, కాని అడగలేక పోయాను. అడగడానికి ఆ అమ్మాయి ముందు నా గొంతు పెగిలి చస్తేగా!

చిన్నప్పట్నుంచి ఇంతే నేను. మొహమాట మెక్కువ. ఓవర్ సెన్సిటివ్‌ని. ‘మనసులోని మాట బయటకు చెప్పుకోలేని బలహీనత వల్ల జీవితంలో చాలా అద్భుతమైన సంఘటనలను మిస్సవుతాం’ అన్న మాటలు నా పట్ల అక్షరాలా నిజం.

ప్రతి చిన్న విషయానికీ విపరీతంగా ఆలోచిస్తూ, చలించే నాకు స్నేహితులు కూడా ఎక్కువ మంది లేరు. ‘లేరు’ అనడం కంటే నేనే ఎవరితో కలవను అంటే బాగా సరిపోతుంది. పుస్తకాలు, కాలేజి, లైబ్రరీ, టేప్‌రికార్డర్ ఇవే నా ప్రపంచం. అటువంటి నా చిన్న ప్రపంచంలోకి అడుగుపెట్టాలని ప్రయత్నించి సక్సెసయ్యింది శిరీష. ప్రతి క్షణం నాకు శిరీష గురించే ఆలోచన. ఆమె మా ఇంటికి వచ్చినరోజు పెద్ద పండుగలా ఫీలయ్యేవాడిని. తన ఫాస్ట్‌నెస్‌కి పైపైన విసుక్కున్నా లోలోపల తన అల్లరి నాకిష్టమే.

“శిరీషా! నువ్వంటే నాకిష్టం” అని ఎన్నోసార్లు శిరీషకు చెపుదామని ప్రయత్నించా కాని చెప్పలేకపోయాను. “నీలాంటి వాళ్లను చాలామందిని చూశాను” అని శిరీషెక్కడంటుందో అని నా భయం. అలా కాకపోయినా, “నువ్వంటే నాకాభిప్రాయం లేదు” అని అన్నా ఆ నిరాశను తట్టుకునేంత బలం నా గుండెకు లేదు. అందుకే శిరీష మీద నాకున్న ప్రేమను నా హృదయంలోనే గుప్తంగా పదిలపరుచుకున్నాడు.

ఇలా నేను శిరీష ప్రేమలో తలమునకవుతున్నా సమయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయడం కోసం వేరే వూరు వెళ్లాల్సొచ్చింది. అన్ని రోజులు శిరీషను చూడకుండా వుండడం ఎలా? అని దిగులేసింది. నేను ఊరుకెళ్లేరోజున గ్రైన్ దగ్గర శిరీష కనిపించింది. ఆశ్చర్యమేసింది. “ఎవరి కోసం వచ్చావ్?” అని అడుగుదామని నోటిదాకా వచ్చింది. అలా అడిగితే శిరీష ఏమనుకుంటుందో అని భయమేసి తనను గమనించనట్లే వుండి పోయాను. శిరీష కొంచెం సేపు అలా ఎవరికోసమో ఎదురుచూసి చివరికి వెళ్లిపోయింది. వెళ్లిపోయేటప్పుడు నా వైపు కోపంగా చూసింది. ఎందుకో నాకర్థం కాలేదు.

* * *

నా పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తయింది. అన్ని రోజులు, శిరీషను చూడకుండా ఎలా గడిపానా అని తలుచుకుంటేనే ఆశ్చర్యమేస్తుంది. శిరీష కనిపిస్తే ఎక్కడ చదువుమీద ధ్యాన భంగ మవుతుందో అని పండుగ శెలవులకు కూడా ఇంటికెళ్లేవాడిని కాను. ఎలా అయితేనేం పి.జి. దిగ్విజయంగా పూర్తిచేసి ఇంటికొచ్చి పడ్డాను. ఇంటికొచ్చి పదిరోజులవుతున్నా శిరీష జాడే కనపడ్లేదు. ఉష నడిగితే ఏమనుకుంటుందో అన్న భయం. శిరీష ఎందుక్కనపడట్లేదు అని ఒకవైపు బాధ నన్ను పట్టి పీడిస్తున్నాయి. ఉష కూడా తనకు శిరీష అనే ఫ్రెండ్ లేదన్నట్లే ప్రవర్తిస్తూంది. నాకు ఉష మీద భలే కోపం వస్తూంది. ఏ వివరాలు తెలియట్లేదే అని.

ఒకరోజు నేను లైబ్రరీ నుండి రాగానే, ఉష ఓ వెడ్డింగ్ కార్డిచ్చింది. “ఎవరిచ్చారు? పెళ్లెవరిది?” అని అడిగాను అందుకుంటూ. “చూడు!” అంది ఉష. కవరు లోపల నుంచి కార్డుతీసి చదవగానే కళ్ళు బైర్లు కమ్మాయి. అది శిరీష వెడ్డింగ్ కార్డ్. నా వైపే చూస్తున్న ఉషనడిగాను “శిరీష ఎప్పుడొచ్చింది?” అని. “నువ్వొచ్చే ముందే వెళ్లింది. ఏం?” అని అడిగింది. “ఏం లేదు?” అని తప్పించుకున్నా అప్పటికి.

నా మొహమాటమే నన్ను

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

14-2-92 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

దెబ్బతీసింది. శిరీష లేని జీవితం వూహించుకోవడానికే నిర్వేదంగా వుంది. ఇక ఎలా బ్రతకనూ?! ఆత్మహత్య చేసుకోలేనంత పిరికి వాడిని. ఏం చేయాలో అర్థం కావట్లేదు. శిరీష పెళ్లి జరిగేది ఆ రోజే. ఉష వెళ్లలేదు పెళ్లికి. "ఎందుకెళ్లలేదు?" అని అడిగా ఉషని. సమాధానమివ్వలేదు ఉష. "ఈపాటికి పెళ్లయి పోయింటుంది కదూ!" అని వందసార్లైనా అడిగి వుంటాను ఉషని.

నాకు శిరీష దూరమై పోయిందన్న ఆలోచన వస్తే చాలు పిచ్చెక్కుతోంది. అందర్నీ తన్నేయాలన్నంత పిచ్చి కోపం వస్తోంది. బలవంతంగా నిగ్రహించు కుంటున్నాను బాధను. బయటికి చెప్పుకోలేని బాధ ఎంతగా వేధిస్తుందో ఆ రోజే అర్థమైంది నాకు.

* * *

ఆ రోజు ఇంట్లో వాళ్లందరూ మా కజిన్ పెళ్లికెళ్లారు. నాకు వెళ్ళాలి అనిపించక వెళ్లలేదు. మంచంపైన పడుకొని కళ్లు మూసుకుని ఆలోచిస్తున్నా. 'శిరీష ఇప్పుడేం చేస్తుంటుంది? బహుశా హనీమూన్ కెళ్లుంటారు' అని అనుకున్నా! ఆ ఊహే భయంకరంగా వుంది నాకు. నా ఆలోచనలకు భంగం కలిగిస్తూ తలుపు తట్టిన చప్పుడు. విసుగ్గా తలుపు తెరిచాను. అదిరిపడ్డాను. శిరీషను చూసి. శిరీష అదేం పట్టించు కోకుండా లోపలికి వచ్చి "ఇంట్లో ఎవరూ లేరా?" అని


రచయిత్రి చిరునామా

**జి.లలిత (బి.యస్సి.)**

డాటరాఫ్. జి.మాలకొండయ్య
మస్తాన్ దర్గా వద్ద
ట్రంక్ రోడ్ - ఒంగోలు


అడిగి నన్ను పరీక్షగా చూస్తూ "ఏమిటలా చూస్తున్నారు? నన్ను గుర్తుపట్టలేదా, మీ చెల్లెలి ఫ్రెండ్‌ని" అంది నవ్వుతూ.

తలెత్తి శిరీష వంక పరీక్షగా చూశాను. అసలు పెళ్లైన ఛాయలే లేవు శిరీషలో. ఆశ్చర్యంగా అడిగాను నేను శిరీషను "మీ శ్రీవారిని కూడా తీసుకురావాల్సింది" అని. "పెళ్లాగిపోయింది" అంది శిరీష నెమ్మదిగా. అంతే, ఒక్కసారిగా నాలో ఆనందం ఉవ్వెత్తున పైకి లేచింది. ఒక్క ఉదుటున తన రెండు చేతులూ పట్టుకుని ఊపేస్తూ "పెళ్లి ఆగిపోయిందా?" అన్నాను.

సంతోషంగా అడుగుతున్న నన్ను చూసి, శిరీష చేతులు విదిలిస్తూ "నా పెళ్లాగిపోతే మీకు సంతోషంగా వుందా? ఏం, ఇప్పుడు కాకపోతే ఇంకొన్ని రోజులకవుతుంది. అయినా నా పెళ్లాగిపోతే మీకెందుకంత సంతోషం?" కోపంగా అడిగింది.

ఇక నేను మొహమాటపడ దల్చుకోలేదు. భగవంతుడిచ్చిన ఈ అవకాశాన్ని వదులుకుంటే ఈసారి నిజంగానే శిరీష నాకు దక్కదు అన్న ఆలోచన రాగానే నాలో ఒక తెగింపు వచ్చేసింది. "ఎందుకా? నువ్వంటే నాకిష్టం గనుక, నేను నిన్ను పెళ్లి చేసుకోవాలను కుంటున్నాను గనుక" అని గబగబా చెప్పేశాను. నా ధైర్యానికి నేనే ఆశ్చర్యపడ్డాను. సమాధానం కోసం అన్నట్లు శిరీష వైపు చూశాను.

నా వైపు హేళనగా చూస్తూ అడిగింది శిరీష "నేనంటే నీకిష్టమా? ఇదే సినిమా డైలాగు" అని. నాకు పిచ్చి ఆవేశం వచ్చింది. గుండె తలుపు తెరిచి, సిన్సియర్‌గా నేను చెప్పే మాటలు డైలాగు లంటు ఒందా శిరీష!?! మళ్లీ అడిగింది శిరీష "ఎన్ని రోజుల నుంచి ప్రేమిస్తున్నావ్ నన్ను?" ఈసారి హేళనగా లేదు శిరీష గొంతు. అందుకే చెప్పాను నిర్భయంగా "నిన్ను చూసిందగ్గర్నుంచి. ఆ విషయం నీకు



ఎప్పుడో చెప్పాలను కున్నాను. కాని ..." అన్న నా మాటను "మొహమాటం వల్ల చెప్పలేకపోయాడు" అని ఉష పూర్తిచేసింది. హఠాత్తుగా అక్కడ కనిపించిన ఉషను చూడగానే ఆశ్చర్యమేసింది నాకు. "పెళ్లి కెళ్లలేదా నువ్వు?" ఆశ్చర్యంగా అడిగాను ఉషను. "వెళ్లలేదు" అని

నాకు సమాధానం చెప్పి శిరీష వైపు తిరిగి, "నువ్వు చెప్పింది నిజమే శిరీషా. మా అన్నయ్యకు నువ్వంటే ఇష్టం అని ఇప్పుడు నమ్ముతున్నాను" అంది ఉష.

"ఏమిటే, నువ్వంటే నాకిష్టమని నీకు ముందే తెలుసా? ఎలా?" అని అడిగాను ఆశ్చర్యంగా. "సస్పెన్స్" అని అంది శిరీష. "ప్లీజ్ ... ప్లీజ్ చెప్పవా!" అని అడిగితే "మన పెళ్లయ్యాక చెపుతాను" అంది.

* * *

ఒకరోజు అడిగాను శిరీషను, "ఇప్పుడు చెప్పవా నువ్వంటే నాకు ప్రేమ అన్న విషయం నీకు ముందే ఎలా తెలిసిందో?" అని. "ఆ విషయం మీరింకా మర్చిపోలేదా?" అంది శిరీష నవ్వుతూ. చాలాసేపు బ్రతిమలాడించుకున్న తరువాత చెప్పింది "మీ డైరీ చూశాను!!" అని. "అదెక్కడ దొరికింది నీకు?"

"చదువులో మనిద్దరికీ కెమిస్ట్రీ కామన్ సబ్జెక్ట్ కదా! ఎటొచ్చీ నేను బి.యస్‌సి. బోటనీ మెయినైతే, మీరేమో మేథమేటిక్స్ మెయిన్. డిగ్రీ కెమిస్ట్రీలో మీరు ప్రిపేర్ చేసుకున్న నోట్సులు కావాలని ఉషనడిగాను. ఉషకు తెలియకపోవడంతో మీ పుస్తకాల రాక్ మొత్తం నన్నే వెదుక్కోమంది. ఆ రోజు అవన్నీ వెదుకుతుంటే మీ డైరీ కిందపడింది. తీసేటప్పుడు దాన్లో వున్న ఫోటోలు ఏవో కిందపడితే, మధ్యలో పెడదామని డైరీ తెరిస్తే నా పేరు కనిపించింది. అంతే, చదవడం తప్పని తెలిసినా నా పేరుండడంతో కుతూహలంతో ఇంటికి తీసుకెళ్లి చదివాను. అప్పుడు తెలిసింది మీకు కూడా నేనంటే ఇష్టమని.

ఒకరోజు నాకు, ఉషకు మధ్య ఏదో టాపిక్ వచ్చి ఉష 'ఎవరైనా ప్రేమలో పడతారేమో కాని మా అన్నయ్య మాత్రం ఎవర్నీ ప్రేమించడు" అని అనగానే, నేను గబుక్కున 'మీ అన్నయ్యకు నేనంటే ఇష్టం!' అని చెప్పాను. అలా చెప్పేశాక భయమేసింది. నా భయం చూసి ఉష అంది, "నువ్వు చెప్పేది నిజమైతే సంతోషించే వాళ్లల్లో మొదటిదాన్ని నేను" అని. "ఐతే ఆ మాట స్వయంగా మా అన్నయ్య నోటివెంట వింటేగాని నమ్మను' అని కూడా అంది. డైరీ చూపిద్దామనుకున్నాను. మళ్లీ నాకు అనుమానం వేసింది. అది ఎప్పుడో నువ్వు డిగ్రీ చదివేటప్పుడు రాసుకుంది, ఇప్పుడు మళ్లీ మీ నిర్ణయం మారి వుండవచ్చు కదా! అని. అందుకే నా అనుమానం నివృత్తి చేసుకోవాలని మా ఫ్రెండ్ వాళ్లన్నయ్య ప్రింటింగ్ ప్రెస్‌లో ఒక వెడ్డింగ్ కార్డ్ వేయించి మీకివ్వమని ఉష కిచ్చాను ...

ఆ తరువాత నిజంగానే నాకు పెళ్లి జరిగిపోతుందనుకొని మీరు బాధపడిన విషయం ఉష చెప్పింది. ఆ తరువాత విషయం మీకు తెలిసిందే!" అని అంది శిరీష.

"అబ్బా! ఎంత నాటకమాటావ్. నిజంగా నువ్వు అలా చెయ్యడం మంచిదే అయింది. లేకపోతే నాకున్న ఆ పాడు మొహమాటం వల్ల ఎప్పటికీ నీకు ఆ విషయం చెప్పలేకపోయేవాడిని. ఆ తరువాత నిన్ను దూరం చేసుకొని జీవితమంతా చింతిస్తూ కూర్చునేవాడిని" అని అన్నాను శిరీషతో. శిరీష నేను చెప్పింది నిజమే అన్నట్లు తలూపింది.

ఇప్పుడు మా ప్రేమ గీతం అందమైన శృతులతో సాగిపోతూంది. నేను పూర్తిగా నా మొహమాటాన్ని వదిలిపెట్టేశాను. ఇప్పుడు నేనెంతగా మారిపొయ్యానంటే, ఒకప్పుడు నాకు 'బుద్ధావతారం' అని పేరు పెట్టినందుకు, ఇప్పుడు శిరీష లెంపలేసుకునేంతగా.

